# అమ్మా నువ్వు మరో పెళ్ళి చేసుకో !

[ఆంధ్రభూమి 5-3-81]

---

మన మనశ్శాంతి కోసం ప్రాచీన సంప్రదాయాలకు శృతి చేస్తున్న ఈ తరానికి నా జోహార్లు.

—జయప్రద

---

"నీ వీణ చూడు, ఎలా పాడయిపోతోందో కాస్త బాగుచేసుకుని సాధన చేయకూడదూ?"

"వీణా! ఇంకెక్కడ కుదురుతుందిలే అత్తయ్యా పిల్లలు పుట్టాక"

పిల్లలు పుట్టాక వీణ వాయించుకో కూడదూ?" ఆశ్చర్యపోతూ చూస్తున్న అత్తవంక చిరునవ్వుతో చూసి....

"ఆఁ వాళ్ళని సక్రమంగా చూసుకుంటే చాలు" అని కొట్టిపారేసింది తేజోవతి.

* * * *

"పెద్దమ్మా!"

కళ్ళనిండా నీళ్ళతో జేవురించిన ముఖంతో వడివడిగా వచ్చి మంచం మీద తన ప్రక్కన కూర్చొన్న చెల్లెలి కూతురు వంక ఆందోళనగా చూసింది జయమ్మ.

"ఏమైంది. ఏమైందే తేజో!"

"ఏముంది ఎప్పుడూ వుండే బాగోతమే ఏమిటీ నరకం మాకు పెద్దమ్మా!" ఉద్రేకంగా మొదలయిన ఆ పిల్ల కంఠంలో కన్నీళ్ళు గర గర లాడాయి.

ఎప్పుడయినా మనసు కలత పడితే ఓదార్చుకోను నాకు పుట్టింటి మీద ఆశ కూడా లేకపోయింది."

"మరలా పద్మావతి ఏదో గొడవ తెచ్చి పెట్టినట్లుంది" అని నిట్టూర్చిందామె.

"తేజో! చిన్నప్పటి నుండి కష్టాలు పడిన పిల్ల పద్మ. ఏదో మీరే సర్దుకుపోండమ్మా."

చివ్వున తలెత్తింది తేజోవతి. కళ్ళు విప్పార్చుకుని, తన పెద్దమ్మ వంక చూసింది. ఆ విశాలమయిన కళ్ళల్లో అలలా కదిలే కన్నీరు.

"అంటే....అంటే ఆమె కష్టాలు పడిందని మేమూ కష్టాలు పడాలా? మా ఆనందం చూడలేని ఆమె....అమె అసలు తల్లా?"

ఆవేశపడుతున్న చెల్లెలి కూతురివంక దిగులుగా చూసింది జయమ్మ.

"అలా అనకమ్మా నీకు మొన్న అపరేషన్ జరిగినప్పుడు తను నిద్రపోకుండా నిన్ను ఎన్ని రోజులు కళ్ళల్లో వత్తులు వేసుకుని కాపాడ లేదూ!"

కాస్త మెత్తబడింది తేజోవతి.

"నిజమే. నిజమే పెద్దమ్మా....కానీ ఆమెందుకిలా బిహేవ్ చేస్తుందో అర్ధంకాదు: తల బద్దలు కొట్టుకున్నా అర్ధంకాదు."

"ఇప్పుడు క్రొత్తగా ఏమైంది?" తన ఒడిలో వున్న తేజోవతి చేతిమీద తన చెయ్యి వేస్తూ అడిగింది జయమ్మ.

"ఇప్పుడా?...." అని జరిగిపోయిన సంఘటనను గుర్తుచేసుకున్న తేజోవతి మాటల్లో మరలా ఆవేశం.

"ఏమీలేదు నేనూ వదినా సినిమా కెళ్ళొచ్చాం మేట్నీకి అందుకే పెద్ద రాద్ధాంతం."

జయమ్మ మాట్లాడలేదు.

జరిగిన సంఘటనను నెమరువేసుకుంటోంది తేజోవతి.

"ఎప్పుడూ సినిమాలు-పాడు సినిమాలు ఒక మాటాలేదు మంతీ లేదు. రేపటితో స్వప్న సినిమా ఆఖరిరోజు మరలా నాకు టౌన్‌కు రాను తీరికుండదు. పోనీ నువ్వూ రాకూడదూ!"

"అదొక్కటే నా బ్రతుక్కి."

జరిగిపోయిన దాన్ని తానొక్కతే గుర్తు చేసుకోవడం ఇష్టంలేనిదానిలా, అసహనంగా తల విదిలించి పెద్దమ్మతో కంప్లెయింట్ చేసింది.

"ఆమె బ్రతుక్కి ఇప్పుడేమయింది పెద్దమ్మా. కొడుకూ కోడలూ, కూతురూ అల్లుడూ అందరూ బ్రతికే వున్నారుగా."

"తేజో!" ఆపింది జయమ్మ.

"చెప్పారుగా అమ్మా! ఆ పిల్ల ఎప్పుడూ సుఖపడింది లేదని.... అందుకే పద్మ ఇలా మారిందేమో!"

"కష్టాలు అనుభవించిన వారే తా ఇలానే తయారవుతున్నారా! కొడుకు బ్రతుకుప, కూతురి బ్రతుకును నరకం చేస్తున్నారా!"

"అందరూ చేయరనుకో, అందరూ ఒక్కలా వుండరుగా తేజో"

"మా ఖర్మ కాబోలు" అని నిట్టూర్చింది తేజోవతి.

జయమ్మ చెల్లెలి కూతురి వంక జాలిగా చూసింది.

"నిజమే పాపం పద్మ వీళ్ళ జీవితాల్ని నరకం చేస్తోంది. సుఖ పడాల్సిన రోజుల్లో వాళ్ళ సుఖాల్ని దోచుకుంటోంది."

"పెద్దమ్మా! నా సంగతి వదిలెయ్. ఎప్పుడయినా వచ్చి పోయే దాన్ని. అన్నదే నాకు దిగులు."

పాపం ఎన్నిరోజులని ఇలా అస్వతంత్రంగా బ్రతుకుతాడు? అన్న స్నేహితులు రాకూడదు.

అమ్మ ముఖంలో చిటపటలు ఉద్యోగం చేస్తున్న మనిషి, స్నేహితులు రాకుండా ఎలా వుంటారు? స్నేహాలు మనిషిని చెడిపేస్తాయట. నేనుండగా ఒకసారి అన్న స్నేహితులు ఇద్దరు వచ్చారు "కాఫీ పంపించమ్మా" అని కేకేసాడు లోపలికి.

"ఆఁ ఇదే చాకిరి నాకు" అని వాళ్ళముందే విసవిసలాడుతూ కాఫీ తెచ్చిచ్చింది. ఆమె అన్నకు చాకిరీ చెయ్యాల్సిన పనిలేదు. అన్నకు వదినుంది చేసిపెట్టను. కానీ అన్న వదినను ఏదయినా అడిగితే అమ్మకు చాలా కోపం వస్తుంది- "ఏం నేను చచ్చిపోయానా?" అంటుంది. అందుకే అన్న అన్నీ అమ్మనే అడుగుతాడు. కానీ ఆమె ఆ మర్యాద ఏమైనా నిలుపుకుంటోందా?" ఆవేశపడి ఆయాసపడుతోంది తేజోవతి.

ఏదో చెప్పి ఆమెను ఓదార్చబోతోంది జయమ్మ.

"నువ్విక్కడున్నావా? అంటూ వచ్చిన అన్నవంక అనాసక్తంగా చూసి తలవంచుకుంది తేజోవతి.

"ఏమిటి పెద్దమ్మా" అంటూ అక్కడే వున్న ఓ కుర్చీ లాక్కుని కూర్చున్నాడు అయోధ్యరామ్.

"పద్మ ఏదో అందటగా?"

"అదా...." అని ఆగి-

."పెద్దమ్మా! కనీసం తేజో వచ్చినప్పుడన్నా అమ్మ కాస్త నిగ్రహంగా వుంటే బాగుంటుంది. తేజో కాస్త సున్నితం-అమ్మ అనే మాటలకు ఊర్కే బాధపడిపోతుంది. అమ్మకు చెప్పినా అర్థం చేసుకోదు. ఈ అమ్మాయి ఆమె మాటల్ని పట్టించుకోకుండా వూర్కోదు.

రోషంగా తలెత్తింది తేజోవతి.

"పట్టించుకోకుండానా? పట్టించుకోకుండా ఎలా వుండడం పెద్దమ్మా. మొన్న పాపకు నాలుగు గాజులు చేయిద్దామని పాత బంగారము ఏదోవుంటే తెచ్చుకుని విజయలక్ష్మి జ్యూయలరీ వాళ్ళను ఇంటికి రమ్మన్నాను. ఆరోజు వాళ్ళముందు నన్ను ఎన్నిమాటలనిందనీ.... నాకు పొదుపు చేయడం చేతగాదట ఎంతసేపటికి నగలూ చీరలూ అంటూ నా పిల్లల్ని నేను అన్యాయం చేసుకుంటున్నానట. నా మొగుడు నేనెలా చెప్తే అలా ఆడుతుండబట్టి నా ఆటలు సాగుతున్నాయట-నేను పెద్దవాళ్ళ సలహా తీసుకోనట-నగలు మాత్రం ఆస్తికాదూ-పోనీ నన్నేదో అందిలే అని వూర్కొందామా అంటే వచ్చినతన్ని కూడా అవమానించి పంపించింది"

"అతన్ని అవమానించిందా?"

"ఆఁ....వాళ్ళంతా మోసగాళ్ళట-బంగారంలో ఎక్కువ రాగి కలుపుతారట-రాళ్ళు బిగిస్తే రోజుకొకటి ఊడిపోవాల్సిందేనట- బత్తుళ్ళతో చేయించుకోవాలిగానీ ఇలాటి మోసపువాళ్ళని పిలుచుకుంటారా?" అని ఓ పెద్ద ఉపన్యాసం"

"ఏదోలేమ్మా దాని చాదస్తం"

"చాదస్తాలు కొన్ని పర్వాలేదు పెద్దమ్మా. వాటితో ఒకర్ని హర్ట్ చేయకూడదు. నీ ఉద్దేశంలో బత్తుళ్ళు మోసం చేయరు. షాప్‌వాళ్ళు మోసం చేస్తారు"

అది ఎన్ని సంవత్సరాలు గడిచినా వాళ్ళు వీళ్ళు, వీళ్ళు వాళ్ళు అవుతున్నా నీ సిద్ధాంతాన్ని నువ్వు మార్చుకోవు పోనీ అదీ ఒప్పు కుంటాను. అతను వెళ్ళిపోయాక ఇవ్వొచ్చుగా ఆ ఉపన్యాసం....అసలు ఎదుటవ్యక్తిని అలా హర్ట్ చేయడం, మాటలతో బాధించడం, అందరికీ చేతనయ్యే పనికాదు". చాలా కోపంగా లేవబోయింది తేజోవతి.

"కూర్చో కూర్చోమ్మా" అంటూ గబుక్కున ఆమె చెయ్యి పట్టు కుని కూర్చోబెట్టింది జయమ్మ.

"నిజమే అమ్మ మరీ ముందూ, వెనకా ఆలోచించకుండా మాట విసిరేస్తుంది" అని చెల్లెలితో ఏకీభవిస్తున్న అయోధ్యవైపు చూసింది జయమ్మ.

"నిజమే నేనూ ఒప్పుకుంటున్నాను. కానీ ఇది మీరు నమ్మాలి. అయోధ్యా ఆమె మీ కొరకు బ్రతికింది" తలవంచుకున్నాడు అయోధ్య. ఆ మాటతో తేజోవతి ఆవేశం కూడా చల్లారిపోయింది.

నిజమే పద్మావతి బ్రతికింది పిల్లలకొరకే.

పద్మావతి పెళ్ళి, జయమ్మ పెళ్ళి ఒకేరోజు అయింది. అదీ మరో ఇంట్లో అన్నదమ్ములకే ఇచ్చి-జయమ్మ పదోక్లాసుదాకా చదివింది. పద్మావతి ఆరో క్లాసుతో ఆగిపోయింది. జయమ్మ భర్త లెక్చరర్, పద్మా వతి భర్తకు చదువబ్బలేదు. తండ్రి మందుల షాపుకు తర్వాత అతను ఓనరయ్యాడు. పద్మావతి, జయమ్మల అత్త సులోచనమ్మ కోడళ్ళంటే చాలా క్రూరంగా ప్రవర్తించేది-జయమ్మ అదృష్టం కొద్దీ ఆమె క్రింద కోడలిగా ఎక్కువ కాలం వుండాల్సిన పనిలేక పోయింది.

ఆమె భర్త సుందరామయ్యకు వేరే ఊరికి ట్రాన్స్‌ఫర్ అయింది.

కానీ పద్మావతికి మాత్రం ఆమె బ్రతికినన్నాళ్ళు అది తప్పలేదు. పైగా భర్త వ్యసనపరుడు. ఆమెతో చెప్పి మరీ పరాయి స్త్రీల దగ్గరకు వెళ్ళే వాడు. ఆమె అతనికి ఆడవాళ్ళను సప్లయి చేసిన రోజులుకూడా వున్నాయి. అదే ప్రాతివ్రత్యమనుకుందామె. అత్తకు నోరెత్తి జవాబు చెప్పేదికాదు. భర్త బ్రతికున్న మూడు సంవత్సరాలూ పతివ్రతగా గొప్ప పేరుతెచ్చుకుంది ఆయన చనిపోయాక ఆ బిడ్డలే లేకపోతే ఆమెకు బ్రతకగలిగే శక్తి వుండేదికాదు.

అంతలా అలసిపోయిందామె. అతను పోయాకకూడా ఆమెను సుఖపడనీయలేదు సులోచనమ్మ. వాడు పోయాకకూడా నీకు సినిమాలు కావాలా? వాడు పోయాకకూడా నీవు పెళ్ళిళ్ళకుహాజరవ్వాలా? అంటూ ఆమె జీవితంలో అన్నీ నిషిద్ధాలే పెట్టింది. దాంతో మంచిపేరు తెచ్చుకోవాలనుకున్న పద్మావతి ఆ కూపంలో ఇరుక్కు పోయింది. తన కోరికలను సమాధి చేసుకుంది.

"నువ్వు ఇక బిడ్డలకొరకే బ్రతకాలి" అని హితవు చెప్పిన వాళ్ళ మాటల్ని తూ. చ. తప్పకుండా పాటించింది.

"మీ అమ్మమీద జాలిపడాలి మీరు" చెల్లెలి కూతురి భుజంమీద చెయ్యి వేస్తూ లాలనగా అంది జయమ్మ.

"పెద్దమ్మా! మా నాన్నమ్మదగ్గర, మా నాన్నగారిదగ్గర ఆమెకున్న సహనమంతా ఇప్పుడేమై పోయింది పెద్దమ్మా" విచారంగా అడిగాడు అయోధ్య.

"నేను రావచ్చా?" అంటూ వాకిట్లో నిల్చున్న భర్తవంక చిరునవ్వుతో చూసింది జయమ్మ.

"అయ్యో! మీకు తెలియనిదేముంది ఇందులో. మరలా మా పద్మ ఏదో అందట" అతడు మెల్లిగా నడిచివచ్చి అయోధ్య లేచి ప్రక్కకి జరిగి ముందుకు తోసిన కుర్చీలో కూర్చున్నాడు.

"దానికి కారణం వుందిరా అయోధ్యా" అని ప్రారంభించా డాయన ఆయన సైకాలజీ లెక్చరర్. ఈ మధ్యనే రిటైర్ అయి స్వంత ఊరి కొచ్చేసారు. పద్మావతి ఇంటికి రెండిళ్ళ ఇవతల ఓ ఇల్లు బాడుగకు తీసుకుని వుంటున్నారు. వాళ్ళకిఒక్కతేకూతురు. ఆమెకు పెళ్ళయి అత్తగారింట్లో వుంది.

ఆమె ఆ రోజుల్లో అలా తన కోరికల్ని, కోపాల్ని తనలోనే దాచుకోబట్టి—అవన్నీ ఈరోజు ఒక్కసారిగా బర్స్ట్ అయ్యాయి. అలా కాకుండా ఆ రోజుల్లో ఆమెకూడా చీమూ నెత్తురున్న మనిషిలా కొంత ఆవేశపడుంటే తన కోరికల్ని నిర్భయంగా చెప్పుకోగలిగుంటే వాటిని తీర్చుకోగలిగుంటే ఈనాడు ఇలా శాడిస్ట్‌గా మారుండేదికాదు. మంచి పేరుమీద మమకారంతో ఆ రోజు తన సుఖాల్ని చేజేతులా వదులుకున్న ఆమె ఈ రోజు వయసు గడిచి పోయాక పశ్చాత్తాపపడుతోంది."

"పశ్చాత్తాపపడుతోందా! అలా అన్పించదు పెదనాన్నా! ఆ రోజుల్లో తను అనుసరించిన మార్గమే మంచిదన్నట్లుగా మాట్లాడుతుంది."

"అది ఆత్మవంచన. ఇంకా ఆ అమ్మాయి ఆత్మవంచన చేసుకుంటూనే వుందన్నమాట" అని నిట్టూర్చారాయన

"నిజం. నిజం పెదనాన్నా! అమ్మ ఎప్పుడు అంతే! చిన్నప్పుడు ఉంగరెట్టల జాకట్టు వేసుకునేవారట. వాటి అందం మీ జాకెట్లకొస్తుందా? అంటుంది. వాళ్ళు మిరియాల గాజులు చేయించుకునేవారట వాటి గొప్పతనం మీ ఫ్యాషన్ల గాజులకొస్తుందా అంటుంది. ఆ రోజుల్లో చిన్న చిన్న పూతల చీరలు కట్టేది. అవే ఆనాటికి క్రొత్తగా ఫ్యాషన్ కాబోలు. ఇప్పటికీ నన్ను అలాటివే కొనుక్కోమంటుంది" అని విచారంగా నవ్వి—

"అది తల్లిగానీ, బిడ్డగానీ కొంత అసూయ వుంటుందేమో! లేకపోతే పెదనాన్నా నేనూ, వదినా సినిమాకెళ్ళినా, పకపక నవ్వుకున్నా ఆమె ఓర్చుకోలేదు. పిల్లల్ని నా ఎదాన వదిలి మీరు మాత్రం హాయిగా

వుండడనో, ఏదో రభసచేసి మా కళ్ళల్లో నీళ్ళు చూస్తేగాని తృప్తి పడదు అన్న వదినను ప్రేమగా చూడడం అసలు గిట్టనే గిట్టదు" అంది విచారంగా

తమ్ముడి కూతురివంక జాలిగా చూసారాయన.

"దాన్ని అసూయ అంటారంటావా తేజో! నాకలా అన్పించ దమ్మా! అదోరకం ఫర్‌వర్ట్‌డ్ మనస్తత్వం-ఆమె తన భర్త చనిపోయి నాక ఇంతవరకూ సినిమా చూళ్ళేదు. షాపింగ్‌కంటూ వెళ్ళలేదు. మన స్ఫూర్తిగా నవ్వినా ఎవరేమనుకుంటారో నన్నట్టు మెలిగింది."

"ఆమె ఒంటిమీద రంగుచీరలేదు, తల్లో పూల్లేవు, ముఖంమీద బొట్టులేదు-ఇవన్నీ ప్రతి స్త్రీకి కావాలనిపించేవి. వాళ్ళు నోరెత్తడం లేదని, ఆ జీవితంతో తృప్తి పడ్తారనుకోవడం మన అవివేకం-అలా ఈ సమాజం కొరకు తన కోరికల్ని సమాధి చేసుకున్న ఆమె రంగురంగుల చీరలతో, తలనిండా పూలతో, నుదుట కుంకుమతో వెళ్ళే స్త్రీలనుచూసి అసూయ వుండదనుకోవడానికి ఆస్కారంలేదు. కాకపోతే ఇప్పుడు మిమ్మల్ని చూసి ఆమె అసూయ పడుతుందంటే నేను అంగీకరించను. కారణం ఆమె బిడ్డలు మీరు.

కాకపోతే మీరింకా చిన్నపిల్లల్లా ఆమె కట్టుకోమన్న చీర కట్టు కోవడం లేదని, కొనుక్కోమన్న నగ కొనుక్కోవడంలేదని- ఆమెమాట మీరు వినడంలేదని తాను మీ కొరకు అన్ని త్యాగం చేయడంలో తప్పు చేసిందని, ఆ భావంతో ఒకరకమైన కోపంతో, విచక్షణను మర్చిపోయి ప్రవర్తిస్తోందంతే-అసలీ సమాజం మనుషులకు నిషిద్ధాలు విధించి వాళ్ళను పశువులుగా మారుస్తోంది"

"ఈ సమాజం కొరకు ఆమె సుఖాల్ని ఎవరు త్యాగం చేయ మన్నారు! మేము చెప్పామా? ఇప్పుడు మమ్మల్ని సాధించడానికి" కోపంగా అంది తేజోవతి.

జయమ్మ అందుకుంది. "అది త్యాగంకానీ కాకపోనీ ఆమె మీ కొరకు బ్రతికింది తేజో! ఆమె మీ దగ్గరనుండి కృతజ్ఞతని ఆశిస్తోంది. మీ సంపూర్ణమైన ప్రేమ ఆమెకి కావాలి. ఆ భావం ఆమె కుండడంలో అసహజ మేమీలేదు. నాకు చూడు నాకంటూ ఓ ప్రపంచాన్ని మీ పెద నాన్న చుట్టూ అల్లుకున్నాను. కానీ మీ అమ్మకి అలా కాదు. ఆమెకు మీరే ప్రపంచం అయిపోయారు. అలా మీమీద అన్ని ఆశలూ పెట్టుకుని ఇన్ని సంవత్సరాల శూన్య జీవితాన్ని నెట్టుకొచ్చిన ఆమెకు మీరు ఆమె ఊహించిన రీతిలో లేకపోవడంతో...

"ఆగు పెద్దమ్మా! అలా అనకు. నా విషయం వదిలెయ్. కాని అన్నయ్య అమ్మ ఎంత చెపితే అంత అయినా అన్నను ఎందుకు సాధి స్తోంది అమ్మ? మొన్నటికి మొన్న అన్నను ఇంటి ఖర్చులకు డబ్బు అడిగింది. నీకు తెలుసుగా అన్న ఎప్పుడూ అమ్మ ఏది అడిగినా కాద నడు పాపం. వదిన్నే ఇంకా కాదంటాడుగాని 'మొన్నిచ్చిన పటి అయి పోయిందామ్మా' అన్నాడు. అంతే! గయ్‌మని లేచిందమ్మ. నేనుగాని తింటున్నానా? ఎవరికయినా దానాలు చేస్తున్నానా? కావాలంటే లెక్కలు చూసుకో" అని లెక్క కాగితం తెచ్చి నానా గందరగోళం చేసేసింది. కాజువల్‌గా మాట వరుసగా అడిగాడేకాని అన్నకు అమ్మమీద ఎలాంటి అనుమానం లేదు. అయినా ఏదో నరకం సృష్టించందే ఆమెకుతోచదు"

"అసలు పెదనాన్నా! అమ్మలో నేనో మార్పు చూసాను పెద నాన్నా! నేను ఉద్యోగస్థుడిని కాకముందు అమ్మ అన్ని లెక్కలు చూసి ఖర్చు చేసేది. ఎక్కడ ఏ కొంత డబ్బు వచ్చినా, మా కొరకు ఆదా చేయడానికే ప్రయత్నించేది. కాని ఇప్పుడు అలాకాదు-ఆస్థులన్నీ కరిగి పోయాక నా ఒక్కడి సంపాదనతో ఈ ఇల్లు ఎలా నడుస్తుందా అని ఆలోచించడం. పైగా నా డబ్బు పరాయి డబ్బన్నట్టు లెక్కలు చూస్తుంది. ఇదంతా నేను మా అమ్మమీద ఫిర్యాదు చేస్తున్నాననుకో కండి. అసలిలా ఎందుకు మారింది అమ్మ అని ఆలోచిస్తున్నానంతే...."

"వయసుతో పాటు మార్పు సహజం" అంటున్న పెద్దమ్మ వంక తీవ్రంగా చూసింది తేజోవతి.

"అయితే మీరు మారలేదేం?"

ఆమె నవ్వింది.

"మన మనసులో మెదిలే భావాన్ని, కదిలే ఆవేశాన్ని బయట పెట్టుకుంటే అందరం పద్మావతులమే అవుతాము. కాకపోతే మనసులో కదిలే భావాన్ని బయట పెట్టుకోము మనం. 'ఎవరేమనుకుంటారో? ఎవరేమి బాధపడతారో మనం విసరబోయే మాటవల్ల' అని ఆలోచించి ముఖ్యాతిక భాగం మాట్లాడాలనుకున్నది మాట్లాడకుండానే మనలోనే దాచేసుకుంటాం. అంతే.... అంతే.... తేజో...."

"మా అమ్మలో ఆ వివేకం లేకపోయింది" అని బాధపడింది తేజోవతి.

"వివేకం ఎందుకు లేదు. అదే లేకపోతే మీ నాన్నమ్మ దగ్గర అంత మంచిపేరు ఎలా సంపాదించుకుంది. కాకపోతే ఇప్పుడు.... తను సాధించాలనుకున్నది సాధించాక అదే మిమ్మల్ని పెద్దజేసి ప్రయోజకుల్ని చేసేశాక తనగురించి తను ఆలోచించడం మొదలెట్టుంటుంది. నేను వీళ్ళ కొరకు జీవితంలో చాలా కోల్పోయాను. అయినా వీళ్ళు నా కొరకు బ్రతకడం లేదు" అనే భావం వల్ల ఆమెలో సున్నితమైన భావాలు పోయి కర్కశత్వం, ప్రతీకారం లాటి భావం చోటు చేసుకుంది.

సుందరరామయ్య కుర్చీలో సర్దుకుని కూర్చున్నారు. "చూడమ్మా అయోధ్య చెప్పాడే ఆ విషయం కూడా యధార్థమే.

తన చేతిలో డబ్బున్నప్పుడు తన వాళ్ళకొరకు తాపత్రయ పడతారు.

తల్లిదండ్రీ తన చేతిలో నుండి అది తప్పుకుని కొడుకు పరం అయ్యాక వాళ్ళకి జ్ఞానోదయం అవుతుంది.

అయ్యో! మనకంటూ కొంత వుంచుకోకపోతిమే! అని. కొడుకు ఎంత బాగా చూసుకున్నా తనమీద ఆధారపడి బ్రతికిన కొడుకు దగ్గర నుండి తీసుకోవడానికి తండ్రికి నామోషీ అందుకే ఒక వయసులో తండ్రికి బిడ్డకీ మధ్య వాగ్యుద్ధాలు తప్పడం లేదు. తను బ్రతికినన్నాళ్లూ తనమీద ఆధారపడే బిడ్డలు బ్రతకాలని అంతర్గతంగావాళ్ళకు తెలీకుండానే వాళ్ళు కోరుకుంటారు."

పెదనాన్న చెప్పిన థియరీని జీర్ణించుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు అయోధ్య.

"అందుకే ఎవరి జీవితాలు వాళ్ళకుండాలి. ఎవరి ఆర్థిక పటుత్వం వాళ్ళకుండాలి. అప్పుడు కొన్ని సమస్యలుండవు."

"అది వదిలెయ్యండి పెదనాన్నా! డబ్బది ప్రాబ్లమ్ కాదు. వదిన కూడా మంచిదే.

ఇప్పుడు అన్న సంపాయించేదంతా తెచ్చి అమ్మ చేతితో పోస్తాడు.

ఈ నరకం తనకు తప్పుతుందంటే....కానీ ఇంటికి స్నేహితులు రాకుండా, ఎవ్వరితోనూ సరదాగా నవ్వుకోకుండా-మా జీవితాలు ఆమె

చుట్టూతానే అల్లుకోవాలనుకుంటే అదెలా వీలవుతుంది? అసలు అదెలా జీవితమవుతుంది?"

నిట్టూర్చాడు సుందరరామయ్య.

పెదనాన్న జవాబు కొరకు ఆతృతగా ఎదురు చూస్తున్నాడు అయోధ్య.

"దీనికి పరిష్కారం నేను చెప్పలేను గానీ అయోధ్యా! దీనికి కారణం మాత్రం చెప్పగలను.

చిన్నప్పటి నుండి మీ అమ్మ తన జీవితాన్ని, కోరికల్ని, ఆశల్ని ఆశయాల్ని సర్వాన్నీ మీ చుట్టూ మాత్రమే నిర్మించుకుని బ్రతికింది. మీరు ఆమెమీద ఆధారపడ్డంత వరకు, ఆమె కొంగు పట్టుకుని తిరిగి నంతవరకు ఆమెకు బాగానే వుండింది. కానీ మీరు పెద్దవాళ్ళయ్యాక ఆమె ఆశించిన కృతజ్ఞత ఆమె కోరిన రీతిలో ఆమెకు దొరకలేదు. మీరు మీ ప్రపంచాన్ని నిర్మించుకుంటున్నారు.

ఆమె చుట్టూ ఇంతవరకు అల్లుకున్న చేతుల్ని విడదీసుకుని స్వతంత్రంగా బ్రతుకుతున్నారు. అది ఆమెలో అంతర్గతంగా మంటల్ని రేపుతోంది."

"నేను అర్థం చేసుకోగలను పెదనాన్నా. కానీ దానికి మేమెంత వరకు బాధ్యులం?"

"అయోధ్యా! దీనికెవరూ బాధ్యులు కారు. కేవలం ఆమె పరిస్థితు లంతే.

ఆమె భర్త అంత చిన్న వయసులోనే చనిపోకపోయినా, ఒకవేళ చనిపోయినా. ఆమెకిన్ని నిషిద్ధాలు విధించబడకపోయినా, మీ చుట్టూనే ఆమె సర్వ ఆశల్నీ అల్లుకోకుండా తనకంటూ స్వంత ప్రపంచాన్ని నిర్మించుకున్నా—అంతెందుకు మా మాధవరావును పెళ్ళి చేసుకున్నా ఆమే ఇలా మారకపోయుండేది."

"మాధవరావుగారా? ఆయనెవరు పెదనాన్నా! ఆయన అమ్మను పెళ్ళి చేసుకుంటానన్నారా?"

ఆసక్తిగా చూసాడు అయోధ్య.

"ఇప్పుడా విషయాలన్నీ ఎందుకు? భర్తను వారించబోయింది జయమ్మ.

"ఇప్పుడా అవసరం వచ్చింది జయా! పద్మావతి పరిస్థితులేమిటో వీళ్ళకు పూర్తిగా తెలియాలి. లేకపోతే పిల్లలు పాపం ఆమె ప్రవర్తన కర్థం తెలీక అల్లాడిపోతున్నారు."

జయమ్మ మరి మాట్లాడలేదు.

"చెప్పు పెదనాన్నా"

"మీ నాన్న చనిపోయాక నా స్నేహితుడు మాధవరావు మీ అమ్మను పెళ్ళి చేసుకుంటానని ముందుకొచ్చాడు." అప్పటికి అతని భార్య కూడా చనిపోయింది. అతనికో ఆడపిల్ల, ఈ విషయం చెప్పి నిర్ణయం ఆమెకే వదిలేసాను.

"మీరు పెద్దమ్మ అందుకు ఇష్టపడ్డారా పెదనాన్నా!" కుతూహలంగా అడిగాడు అయోధ్య.

"నాకిష్టమే అయోధ్యా! కానీ మీ పెద్దమ్మకి ఇష్టంలేదు పిల్లలు అన్యాయమయిపోతారంది" చిరునవ్వుతో భార్యవైపు చూసాడు.

'తర్వాత'

"తర్వాత మీ అమ్మేకాదంది. పిల్లల్ని అన్యాయం చేయలేనంది. పైగా అంతవరకు ఆమె సంపాయించుకున్న మంచి పేరును పోగొట్టు కోదల్చుకున్నట్టు లేదామె"

"నాన్నమ్మ ఒప్పుకొనుండేదా పెదనాన్నా!" ఈసారి తేజోవతి అడిగింది.

"ఉహుఁ ఆమె ఒప్పుకోనుండుండదు. ఆమె ఒప్పుకోక పెళ్ళి ఆగిపోయుంటే, ఇప్పుడు మీ అమ్మలో ఈ పశ్చాత్తాపం దాని తాలూకు ఉక్రోషం వుండేవి కావు.

ఇది స్వయం కృతాపరాధం కదూ! అందుకే ఆమె ఎక్కువ బాధ పడుతోంది."

"అమ్మ మరలా పెళ్ళి చేసుకొనుండాల్సింది" అన్నాడు అయోధ్య.

అదే భావం తేజోవతిలోనూ మెదిలింది. అప్పుడు ఆమె సుఖ పడుండేది. తమకీ నరకం తప్పుండేది.

సుందరరామయ్య ఐదు నిముషాలు ఆలోచిస్తూ వుండిపోయాడు.

ఆ తర్వాత....

"అయోధ్యా! అలా పిల్లలకొరకే బ్రతికిన తల్లులు, పిల్లల దగ్గర నుండి కొండంత కృతజ్ఞత నాశించడం సహజమేనయ్యా" కానీ ఇంకో సహజమైన సంగతేమంటే వయసు రాగానే పిల్లలు తల్లినుండి డిటేచ్

కావడం, కానీ చాలామంది పెద్దవాళ్ళు ఆ సత్యాన్ని జీర్ణించుకోలేక అల్లాడిపోతున్నారు అని నిట్టూర్చారు.

"అమ్మో! ఓ ఇరవయ్యేళ్ళు పోయాక తనూ అలాగే అయిపోతుందా! తన తనూజ్‌కి, బిందుకి జీవితంలో నరకాన్ని సృష్టిస్తుందా? ఊహుఁ అలా జరగడానికి వీల్లేదు. తనకంటూ ఓ జీవితాన్ని తను నిర్మించుకోవాలి. భర్త, పిల్లలు వీళ్ళచుట్టూ తన బ్రతుకును అల్లుకుని ఆ తర్వాత వాళ్ళను అశాంతిపాలు చేయకూడదు"

"ఇంటికి వెళ్ళగానే మరలా వీణ సాధన చేసుకోవాలి" తన బిడ్డల భవిష్యత్తుని తలచుకొని విపరీతంగా భయపడిపోతూ, తనకు తోచిని నిర్ణయాన్ని తను చేసుకుంది తేజోవతి.

❋